
సాక్షి
విశాఖపట్నం
బుధవారం, 3, సెప్టెంబర్, 2025


అదరగొట్టిన దబాంగ్ ఢిల్లీ 8లో


యువతకు ఫ్యూచర్ స్కిల్స్ చేరువ చేయాలి 8లో


వినాయక నవ రాత్రి మహోత్స వాల్లో భాగంగా మంగళవారం సంపత్ వినాయ గర్ స్వామి రాజ గణపతి అలం కారంలో దర్శన మిచ్చారు.

న్యూస్‌రీల్

7న ఉదయం 11.30 వరకే అప్పన్న దర్శనాలు



సింహాచలం: ఈ నెల 7న చంద్రగ్రహణం కారణంగా ఆ రోజు ఉదయం 11.30 గంటల వరకు మాత్రమే శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దర్శనాలు లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. తిరిగి 8న ఉదయం 8 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. 7న మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే నిత్యాన్నదాన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. 7, 8 తేదీల్లో స్వామికి జరిగే అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు తెలిపారు. సుప్రభాత సేవ, ఆరాధన టిక్కెట్లు కూడా రద్దు చేసినట్లు వెల్లడించారు. భక్తులంతా ఈ విషయాలను గమనించాలని కోరారు.

రిజిస్ట్రార్‌గా రాంబాబు బాధ్యతల స్వీకరణ



ఏయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య రాంబాబు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు కె.రాంబాబు మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు వైస్ చాన్సలర్ ఆచార్య జి.పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనంజయరావు, పలువురు ప్రిన్సిపాళ్లు, డీన్లు, ఆచార్యులు, ఏయు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. రిజిస్ట్రార్ రాంబాబు విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్‌పై తొలి సంతకం చేశారు.

సీఎం చంద్రబాబుకు స్వాగతం



మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి విశాఖలో స్థానిక నేతలు, అధికారుల నుంచి ఘన స్వాగతం లభించింది. మంగళవారం మధ్యాహ్నం 2.45 గంటలకు కోస్టల్ బ్యాటరీ వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకున్న ఆయనకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శ్రీబాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ శ్రీ భరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్ తదితరులు స్వాగతం పలికారు. నోవోటెల్‌లో జరిగిన ఈస్ట్ కోస్ట్ మారీ టైమ్ అండ్ లాజిస్టిక్ సదస్సులో పాల్గొన్న ఆయన సాయంత్రం 4.45 గంటలకు తిరుగు పయనమయ్యారు.

డీఎస్సీ రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

ఉక్కునగరం: డీఎస్సీ రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం నిర్వహించారు. ఇందు కోసం ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయంలో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు సకాలంలో కాల్ లెటర్లు అందకపోవడం, దూర ప్రాంతాల్లో అనేక మంది ఉండటంతో తొలి రోజు 82 మంది అభ్యర్థులు మాత్రమే హాజయ్యారు. మొదటి రోజు హాజరు కాని వారి కోసం బుధవారం అవకాశం కల్పించినట్టు అధికారులు తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియను డీఈవో ప్రేమ్‌కుమార్, ఆర్జేడీ విజయభాస్కర్ పర్యవేక్షించారు.

గంగవరం పోర్టు రికార్డు

పెదగంట్యాడ : అదానీ గంగవరం పోర్టు సరికొత్త రికార్డు సాధించింది. 2025లో 66 నౌకల నిర్వహణతో ఈ రికార్డు సొంతం చేసుకుంది. 2024లో 61 నౌకలతో అదానీ గంగవరం పోర్టు పేరిట ఉన్న రికార్డును తిరగిరాసింది. కస్టమర్ ఫస్ట్ విధానంలో భాగంగా ఈ ఘనత సాధించామని పోర్టు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.

పేదల గుండెచప్పుడు వైఎస్సార్



బీచ్‌రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, మాజీ మంత్రి బాలరాజు, డిప్యూటీ మేయర్ సతీష్, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, పార్టీ నేత జాన్ వెస్లీ

- మహానేత ఆశయాలకనుగుణంగానే వైఎస్ జగన్ హయాంలో పాలన
- వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, చిత్రంలో మాజీ మంత్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి, తైనాల, గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సతీష్, పార్టీ నేతలు

సాక్షి, విశాఖపట్నం : అభివృద్ధి, సంక్షేమంతో పేదల తలరాత మార్చిన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. ఉమ్మడి విశాఖపై వైఎస్సార్ అందించిన అభివృద్ధి ముద్రలు ఎప్పటికీ చెరగనివని కొనియాడారు. జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం మద్దిలపాలెంలో గల పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ చేసిన మంచి కార్యక్రమాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, 108, 104 అంబులెన్స్‌లు, జలయజ్ఞం వంటి ఎన్నో గొప్ప కార్యక్రమాలను చేపట్టారన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. సమావేశంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ కుమార్, తిప్పల గురుమూర్తిరెడ్డి, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవి రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు జాన్ వెస్లీ, పేర్ల విజయ చంద్ర, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, రీజినల్ యువజన విభాగం అధ్యక్షుడు అంబటి శైలేష్, ముఖ్యనేతలు రొంగలి జగన్నాథం, వుడా రవి, నడింపల్లి కృష్ణంరాజు, డాక్టర్ జహీర్ అహ్మద్, సతీష్‌వర్మ, పి.రవి రాజు, కార్పొరేటర్లు బానాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, కె.అనిల్‌కుమార్ రాజు, స్వాతి దాస్, బర్కత్ అలీ, శశికళ, పద్మారెడ్డి, బిపిఎస్ కుమార్ జైన్, పార్టీ నాయకులు బోని శివరామకృష్ణ, అల్లంపల్లి రాజుబాబు, రామన్న పాత్రుడు, తాడి జగన్నాథ రెడ్డి, బోని బంగారునాయుడు, సనపల రవీంద్ర భరత్, సేనాపతి అప్పారావు, శ్రీదేవి వర్మ, రాధ, సకలభక్తుల ప్రసాద్, రామిరెడ్డి, దిలీప్ కుమార్, బొండా ఉమామహేశ్వరరావు, జిలకర్ర నాగేంద్ర, దేవరకొండ మార్కెండేయులు, నీలి రవి, మువ్వల సురేష్, పల్లా దుర్గ, మంచ మల్లేశ్వరి, బొండా శ్రీను, తదితరలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మహానేతకు సేవా నివాళి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పలు వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో అన్నసమారాధన చేశారు. నిరుపేదలకు వస్త్రాలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.



పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు



సీతమ్మధార పాపా హోంలో అల్పాహారం వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, కార్పొరేటర్లు శశికళ, అనిల్‌కుమార్‌రాజు



పాతగాజువాక జంక్షన్‌లో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి



జగదాంబ జంక్షన్‌లో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకులు జాన్ వెస్లీ తదితరులు

‘అంగన్‌వాడీ’లకు పదేళ్లకు దక్కిన న్యాయం

- తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోండి
- బకాయిలన్నీ చెల్లించి అన్ని సదుపాయాలను కల్పించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

విశాఖ లీగల్: పదేళ్ల క్రితం అన్యాయంగా తొలగించిన అంగన్‌వాడీ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. విధుల్లో తొలగించిన ఉద్యోగులకు ఐదేళ్ల ఒక నెలకు సంబంధించిన పాత బకాయిలు, జీతభత్యాలతోపాటు మిగతా ఉద్యోగుల మాదిరిగానే సదుపాయాలను కల్పించాలని ఆదేశించింది. జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ అగస్టీన్ జార్జ్ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పూల వీర్రాజు అందించిన వివరాల మేరకు.. 2015లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లలో పదో తరగతి పాసైన వారికి సూపర్‌వైజర్ లేదా గ్రేడ్-2 హోదా కల్పిస్తూ అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఓ కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ 15 మంది అంగన్‌వాడీ వర్కర్లను సూపర్‌వైజర్లుగా ఎంపిక చేసింది. కొంతకాలం తరువాత రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా వీరిని పక్కన పెట్టారు. దీంతో బాధిత ఉద్యోగులు ఏపీ పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.

ఉద్యోగులకు అనుకూలంగా ట్రిబ్యునల్ ఆదేశాలిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. అక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ 2018లో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో 15 మందిపై స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేసింది. విశాఖకు చెందిన సీనియర్ న్యాయవాది పూళ్ల వీర్రాజు బాధితుల తరపున వాదనలు వినిపించారు. వాదనల అనంతరం బాధితులకు అనుకూలంగా సుప్రీంకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. బాధితులు సాక్షితో మాట్లాడుతూ పదేళ్ల తమ సుదీర్ఘ పోరాటం ఫలించిందన్నారు.

కేజీహెచ్‌లో కోల్డ్‌వార్

- వైద్యులు, అడ్మినిస్ట్రేటర్ మధ్య ఆధిపత్య పోరు
- ఇంకా వినియోగంలోకి రాని ఏబీజీ పరీక్షలు
- అదుపు తప్పిన పరిపాలన.. పనిచేయని ఏసీలు



మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు పలు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కేజీహెచ్‌లో పాలన గాడి తప్పుతోంది. ఆస్పత్రిలో కొత్తగా నియమితులైన అడ్మినిస్ట్రేటర్, వైద్యుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొత్తగా డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్‌గా నియమించడంపై వైద్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి పాలనా వ్యవహారాలు వైద్యులే చూడాలని వారు అభిప్రాయపడుతున్నారు. అడ్మినిస్ట్రేటర్ ప్రతి ఫైల్‌ను పరిశీలించడం, అన్ని నిర్ణయాల్లో జోక్యం చేసుకోవడం వల్ల వైద్యులకు, అడ్మినిస్ట్రేటర్‌కు మధ్య ‘కోల్డ్ వార్’ నడుస్తోంది. ఇటీవల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఆస్పత్రిని సందర్శించినప్పుడు అడ్మినిస్ట్రేటర్ తనదైన శైలిలో కార్యక్రమాన్ని నిర్వహించారని, కనీసం ఆస్పత్రిలోని డిప్యూటీ సూపరింటెండెంట్లు, హెచ్‌వోడీలు, ఇతర వైద్యులను ఆహ్వానించకుండా వ్యవహరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటన వీరి మధ్య ఆధిపత్య రగడ మొదలైందని తెలుస్తోంది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ, సమస్యలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గాలికొదిలేసిన సమస్యలు

సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఆస్పత్రిలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఆస్పత్రిలోని 217 ఏసీలలో 90 ఏసీలు మరమ్మతులకు గురయ్యాయి. ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, వైద్యుల గదుల్లో ఏసీలు పని చేయకపోవడంతో రోగులతోపాటు సిబ్బంది కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పరీక్షల నిలిపివేత

కిడ్నీ, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులకు అవసరమైన ఆర్టీరియల్ బ్లడ్ గ్లాస్ పరీక్షలు నిలిచిపోయాయి. పరీక్షలకు అవసరమైన రీజెంట్స్ లిక్విడ్ లేకపోవడంతో 20 రోజులుగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ నుంచి సరఫరా లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

డ్రైనేజీ సమస్య

క్రిటికల్ కేర్ యూనిట్ వెనుక భాగంలో మంగళవారం డ్రైనేజ్ సమస్య తలెత్తింది. వ్యర్థాలు, చెత్త బయటకు రావడంతో కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని వారు వాపోయారు. ఆస్పత్రిలో నెలకొన్న ఈ అంతర్గత విభేదాలు, పర్యవేక్షణ లోపం కారణంగా వైద్య సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిశ్రమలకు పూర్తి సహకారం

డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలోని పరిశ్రమల నిర్వహణకు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పర్ట్ అండ్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో ఆయన ఈ మేరకు హామీ ఇచ్చారు.పారిశ్రామికవేత్తలు, వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ పలు అంశాలపై చర్చించారు. పారిశ్రామికవాడల్లో అవస్థాపనా సౌకర్యాలు కల్పించటంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఏపీఐఐసీ ద్వారా కేటాయించిన భూముల్లో నిర్ణీత సమయంలోనే పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇండియన్ ల్యాండ్ ఆర్మీ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు, ఆటోనగర్, ఐటీ హిల్స్ ప్రాంతాలలో ప్రత్యేక బస్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అలాగే, సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ నెలలో జరిగిన స్క్రూటినీ అండ్ వెరిఫికేషన్ కమిటీ సమావేశంలో ఆరు పెట్టుబడుల క్లెయిమ్‌లకు గాను రూ.25,80,487 మంజూరు చేశారు. విశ్వకర్మ యోజన ద్వారా అర్హులైన వారికి లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని కూడా ఆయన ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఫ్యాక్టరీల చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం, పీసీబీ ఈఈ ముకుందరావుతో పాటు వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

సింహగిరిపై పవిత్రోత్సవాలకు అంకురార్పణ

సింహాచలం: సింహగిరిపై మంగళవారం నుంచి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాత్రి అంకురార్పణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుట్టబంగారుమండపంలో నిర్వహించాల్సిన ఈ పూజలను వర్షం కారణంగా ఆలయ కల్యాణమండపంలో నిర్వహించారు. పుట్టమన్నును స్వామి వద్ద ఉంచి మృత్సంగ్రహణం జరిపారు. ఆ మన్నును శిరస్సుపై పెట్టుకుని స్థానాచార్యులు ఆలయ బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. యాగశాల ప్రవేశం, యాగశాలార్చన అనంతరం పుట్టమన్నును పాలికల్లో వేసి అంకురార్పణ నిర్వహించారు. దేవస్థానం ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, అర్చకులు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు. పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవరోజు బుధవారం ఉదయం పవిత్రాధివాసం, చక్రాబ్జమండల రచనం, ఆవాహనం, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



శిరస్సుపై పుట్టమన్ను పెట్టుకుని ఆలయ బేడా మండపంలో ప్రదక్షిణ చేస్తున్న స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు

జూకి కొత్త అతిథులు



రోడ్డిషెల్ డక్



రెడ్ క్రాస్ట్ రూఫ్ టార్టల్(తాబేలు)



స్వాంప్‌డీర్(బారసింగ)



స్ట్రైప్డ్ హైనా



హాగ్‌డీర్



రెడ్‌సాండ్ బోవ, కామన్ పాండ్ బోవ

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కుకు కొత్త వన్యప్రాణులు చేరుకున్నాయి. వన్యప్రాణి మార్పిడి విధానంలో భాగంగా జూ అధికారులు కాన్పూర్‌లోని జూలాజికల్ పార్కు నుంచి వివిధ జాతులకు చెందిన 25 వన్యప్రాణులను మంగళవారం సాయంత్రం రోడ్డు మార్గంలో తీసుకువచ్చారు. వాటికి బదులుగా విశాఖ జూ పార్కు నుంచి పలు జాతులకు చెందిన 23 వన్యప్రాణులను కాన్పూర్ జూ పార్కుకు తరలించారు. కాన్పూర్ జూ నుంచి స్వాంప్‌డీర్లు-3(ఒక మగ, రెండు ఆడవి), స్ట్రైప్డ్ హైనా-1 (ఆడది), కామన్ సాండ్ బోవ-2(అన్‌నౌన్), రెడ్ క్రౌన్డ్ రూఫ్ టార్టల్-4(అన్‌నౌన్), హగ్డీర్-3(ఒకటి మగ, రెండు ఆడవి), ఖలీజ్ ఫీసెంట్-6(మూడు జతలు), రోడ్డుషెల్ డక్-4(రెండు జతలు), రెడ్ సాండ్ బోవ-2(ఒక జత) వన్యప్రాణులను విశాఖ తీసుకువచ్చినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వాటికి బదులుగా విశాఖ జూ పార్కు నుంచి మూడు అడవి కుక్కలు, ఒక స్ట్రైప్డ్ హైనా, ఒక ఇండియన్ గ్రే ఫూల్స్, మూడు జతలు పారాకీట్స్, రెండు జతల గ్రీన్ ఇగ్వానాలు, రెండు బార్కింగ్ డీర్లు పంపించినట్లు తెలిపారు. జూకి తీసుకువచ్చిన వాటిని క్వారంటైన్‌లో ఉంచామన్నారు. కొద్ది రోజుల్లో వాటిని సందర్శకుల కోసం వాటి ఎన్‌క్లోజర్లలో విడిచిపెడతామని తెలిపారు.

5 నుంచి సైన్స్ కాంక్లేవ్

మద్దిలపాలెం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూలో ఈ నెల 5న సైన్స్ కాంక్లేవ్ నిర్వహించనున్నట్లు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు తెలిపారు. అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్‌తో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్రాంటియర్స్ ఫర్ స్వర్ణాంధ్ర అండ్ వికసిత్ భారత్-2047 అనే అంశంపై ఈ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10:30 నుంచి బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుందన్నారు. ఈ సదస్సులో భాగంగా ఏయూతో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అవగాహన ఒప్పందం చేసుకోనుందని ప్రకటించారు. విద్యార్థులకు శాస్త్ర విజ్ఞాన ప్రగతిని వివరించడంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, మానవాళికి ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాలను పరిచయం చేసేలా దేశంలోని ప్రముఖులతో ప్రత్యేక ప్రసంగాలుంటాయన్నారు.

క్లుప్తంగా

రైల్వేస్టేషన్‌లో 50 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగుర్ని విశాఖ రైల్వే పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ), రైల్వే భద్రతా దళం (ఆర్‌పీఎఫ్) సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టాయి. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. ధనుంజయ నాయుడు నేతృత్వంలో ఎస్‌ఐలు కె.టి.ఆర్.లక్ష్మి, ఎం.మధుసూదనరావు, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ పి. శివనారాయణ తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాకు చెందిన గౌరవ్ మిశ్రా, ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన శశాంక్ ప్రధాన్, రజా భారీక్, మహ్మద్ ఫైజాబ్ గంజాయి రవాణాకు సిద్ధంగా ఉండడంతో అనుమానం వచ్చి తనిఖీ చేపట్టారు. వారి నుంచి దాదాపు రూ.2.5 లక్షల విలువైన 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను జీఆర్‌పీ సిబ్బందికి అప్పగించగా, వారు రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

6న డీఆర్సీ సమావేశం

మహారాణిపేట: జిల్లా సమీక్షా కమిటీ సమావేశం (డీఆర్సీ) ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు.

నేటి నుంచి కన్వేయన్స్ డీడ్ రిజిస్ట్రేషన్

మహారాణిపేట : జిల్లా కన్వేయన్స్ డీడ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. పెందుర్తి, ములగాడ, గాజువాక, గోపాలపట్నం, భీమునిపట్నం, విశాఖ రూరల్, పెదగంట్యాడ మండలాల్లో టైం స్లాట్స్ తీసుకొని, సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కన్వేయన్స్ డీడ్ రిజిస్ట్రేషన్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు. గతంలో మంజూరు చేసిన పట్టాలకు సంబంధించి కన్వేయన్స్ డీడ్‌ను తయారుచేశారు.

ఇద్దరు వైద్యులకు పదోన్నతి


మహారాణిపేట: కేజీహెచ్‌లో ఇద్దరు ప్రొఫెసర్లకు అడిషనల్ డీఎంఈగా పదోన్నతి లభించింది. ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ జె.కిశోర్‌ను పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన గైనిక్ విభాగం ప్రొఫెసర్ జి.సామినిని మచిలీపట్నం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

బస్సు కింద పడి ఒకరు మృతి

అల్లిపురం: కాన్వెంట్ జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా..మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూర్ణా మార్కెట్ దరి ప్రసాద్ గార్డెన్స్‌కు చెందిన ఏ.శంకర్, నాయిని చిన్న స్కూటీపై గాజువాక వెళ్తున్నారు. కాన్వెంట్ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే సమయంలో బస్సు వెనుక టైర్ల కింద పడ్డారు. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన చిన్నాని హార్బర్ ట్రాఫిక్ పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు.

సేవలో తరించి..సేవతోనే ముగించి

- ఆర్టీసీ బస్‌లో ప్రయాణిస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి
- స్వచ్ఛంద సంస్థలో కీలక సభ్యుడిగా వ్యవహరిస్తున్న రాజేష్
- మరణం తరువాత అతని నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు



రాజేష్ నేత్రాలను దానం చేసేందుకు అంగీకారం తెలుపుతున్న తండ్రి వరహాలబాబు (ఇన్‌సెట్) గుండెపోటుతో మరణించిన సయ్యపురెడ్డి రాజేష్

పెందుర్తి: మనిషి జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో ఎవరూ ఊహించలేరు. కానీ కొంతమంది జీవితం మాత్రం ఇతరుల కోసం అంకితమై ఉంటుంది. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన సయ్యపురెడ్డి రాజేష్ (రాజా) (42) అలాంటి కోవకు చెందినవారు. అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీలో ఉద్యోగం చేస్తూనే..' అమ్మ హెల్పింగ్ హార్ట్స్' స్వచ్ఛంద 'సేవా సంస్థలో క్రియాశీలక సభ్యుడిగా వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారు. అతని జీవిత 'ప్రయాణం' సేవతో మొదలై, సేవతోనే ముగిసింది.

మంగళవారం మధ్యాహ్నం, చోడవరం నుంచి విశాఖ నగరానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరిన రాజేష్‌ను విధి వెంబడించింది. పెందుర్తి మండలం రాంపురం వద్దకు రాగానే ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తోటి ప్రయాణికులు వెంటనే స్పందించి బస్సు ఆపారు. కండక్టర్ మురళీకృష్ణ వెంటనే రాజేష్‌కు సీపీఆర్ చేయగా, డ్రైవర్ వాసు సమయస్ఫూర్తితో బస్సును పెందుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రి (సీహెచ్‌సీ)కి వేగంగా తరలించారు. కానీ వైద్యులు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే రాజేష్ గుండెపోటుతో మృతి చెందాడు.

మరణంలోనూ మానవత్వం..
నలుగురికి వెలుగులు

రాజేష్ మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు.. 'అమ్మ హెల్పింగ్ హార్ట్స్' ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెందుర్తి ఆస్పత్రికి తరలివచ్చారు. ఆయన చేసిన 'సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకుని కంటతడిపెట్టారు. రాజేష్ మృతి వార్త తెలుసుకున్న పెందుర్తిలోని 'సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్' వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. రాజేష్ నేత్రాలను దానం చేయమని ఆయన కుటుంబ సభ్యులను కోరారు. వారి కోరికను అర్థం చేసుకున్న రాజేష్ తల్లిదండ్రులు వరహాలబాబు, స్వర్ణకుమారి గొప్ప మనసుతో అంగీకరించారు. 'మా కుమారుడు జీవించి ఉన్నప్పుడు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాడు. ఇప్పుడు లేడు. అతని నేత్రాలు నలుగురికి ఉపయోగపడతాయంటే మాకు ఏ అభ్యంతరం లేదు' అని వారు కన్నీళ్లతో తెలిపారు. వారి అంగీకారంతో, 'మోషిన్ ఐ బ్యాంక్' ప్రతినిధి అజయ్ బృందం రాజేష్ నేత్రాలను (కార్నియా) సేకరించారు. నిస్వార్థంగా సేవ చేస్తూ తన జీవితాన్ని అంకితం చేసిన రాజేష్, మరణానంతరం కూడా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపి చరిత్రలో నిలిచిపోయాడు.

యువతకు ఫ్యూచర్ స్కిల్స్ చేరువ చేయాలి

మద్దిలపాలెం: యువతకు భవిష్యత్ నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ అన్నారు. మంగళవారం వీసీ సమక్షంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, నాస్కామ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు, నాస్కామ్ డైరెక్టర్ వి. ఉదయ శంకర్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ కోర్సులకే పరిమితం కాకుండా ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులకు కూడా డిజిటల్ నైపుణ్యాలను అందించడం మంచి పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రతి విభాగానికి ఒక కోఆర్డినేటర్‌ను, విద్యార్థి కోఆర్డినేటర్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. నాస్కామ్ డైరెక్టర్ ఉదయ శంకర్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులకు కూడా ఫ్యూచర్ స్కిల్స్ అందుబాటులోకి వస్తాయని చెప్పారు. భవిష్యత్తులో ఉద్యోగాలకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, వారిని నిపుణులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. భవిష్యత్తులో ఏయూతో కలిసి హెచ్.ఆర్. కాంక్లేవ్, స్కిల్ కాంక్లేవ్ నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎన్. కిషోర్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్. రాజు, డీఈన్స్ ఆచార్య వి.వల్లీకుమారి, కె.రమాసుధ, పి.వెంకటరావు, బి.కిషోర్ బాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అదరగొట్టిన దబాంగ్ ఢిల్లీ

దుమ్మురేపిన పాంథర్స్



విశాఖ స్పోర్ట్స్ : ప్రో కబడ్డీ పన్నెండో సీజన్‌లో తమ తొలి మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ అదరగొట్టింది. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో దబాంగ్ ఢిల్లీ 41–34 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. ఢిల్లీ కెప్టెన్ ఆశు మాలిక్ 15 పాయింట్లతో అద్భుతంగా రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రైడర్ నీరజ్ 7 పాయింట్లతో అతనికి సహకరించాడు. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు తొలి మ్యాచ్‌లో పాట్నా పైరేట్స్‌పై 39–36 తేడాతో విజయం సాధించింది. జైపూర్ తరఫున నవీన్ 13 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. పాట్నా పైరేట్స్ తరఫున మనీందర్ 15 పాయింట్లతో రాణించినా, వారి జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడిపోయింది.

సముద్ర అధ్యయన కేంద్రం భవన నిర్మాణంపై సంతృప్తి



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కొమ్మాది: సాగరతీరంలో నిర్మిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ భవనాన్ని మంగళవారం సాయంత్రం కేంద్ర పరిశీలనా బృందాలు సందర్శించాయి. బేపార్కు కొండ దిగువన, బీచ్ రోడ్డుకు ఆనుకుని దాదాపు రూ.30 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణ పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చీఫ్ సైంటిస్ట్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీవీఎస్ ఎస్. శర్మ తెలిపారు. ఎన్ఐవో డైరెక్టర్ సునీల్ కుమార్ సింగ్ , కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ చీఫ్ ఇంజినీర్ అతుల్ కుమార్ గోయల్ భవన నిర్మాణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే భవనానికి వెళ్లే రహదారి కొండ వాలులో ఉండటం వల్ల, రహదారి మలుపుల వద్ద బలమైన రక్షణ గోడ నిర్మించాలని వారు సూచించారు. ఈ పరిశోధనా కేంద్రంలో ఓషన్ ఫిజిక్స్, సముద్ర అధ్యయనం, పర్యావరణం, ఖనిజ అన్వేషణ, పారిశ్రామిక పరిశోధన వంటి కీలకమైన అధ్యయనాలు జరుగుతాయని పేర్కొన్నారు. భారతదేశంలో ఉన్న 38 ప్రయోగశాలల్లో విశాఖపట్నంలోని ఇది ఒకటి అని వారు తెలిపారు.

డిగ్రీ 'స్పెషల్' అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గడువు నేడు

మద్దిలపాలెం: డిగ్రీ అడ్మిషన్ల కోసం స్పెషల్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారంతో ముగియనున్నట్టు డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పెషల్ కేటగిరీలైన ఎన్‌సీసీ, స్పోర్ట్స్, సీఏపీ(డిఫెన్స్ పర్సనల్), ఫిజికల్లీ చాలెంజ్డ్ వంటి అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలన్నారు. వివరాల కోసం అడ్మిషన్ల కోఆర్డినేటర్ డాక్టర్ డి.రమేష్‌ను సంప్రదించాలని సూచించారు.

బజాజ్ ఈఎంఐ కార్డు పేరుతో మోసాలు

నిందితుడిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

విశాఖ సిటీ: ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డ్ మోసానికి గురైన యువకుడు అదే పంథాలో ఇతరులను మోసం చేసి రూ.లక్షలు సంపాదించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతికత సహాయంతో నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన మధునాగ సాయి(26) డిగ్రీ పూర్తి చేసిన తర్వాత 2023లో విశాఖకు వచ్చాడు. ఇక్కడ స్నేహితులతో అద్దె గదిలో ఉంటూ ట్రావెల్స్, కార్, బైక్ అద్దె వ్యాపారం చేసేవాడు. 2024లో ఒకసారి తన క్రెడిట్ కార్డు ద్వారా రూ.5 వేలు మోసపోయాడు. అదే పద్ధతిని అనుసరిస్తూ డబ్బు సంపాదించవచ్చని ఆలోచనకు వచ్చాడు. దీంతో 'మీ బజాజ్ ఈఎంఐ కార్డు ఇస్తే అందులోని మొత్తాన్ని క్యాష్ చేస్తా. 10 శాతం కమీషన్ మాత్రమే తీసుకుంటా' అని ఇన్‌స్టాగామ్‌లో నకిలీ ఐడీ సృష్టించి పోస్టులు పెట్టాడు. దీనిని చూసిన పలువురు అతడిని సంప్రదించారు. వారి ఈఎంఐ కార్డులతో అమెజాన్, షోరూమ్‌లలో ఏసీలు, ఫ్రిజ్‌లు, మొబైల్స్, వాషింగ్‌మెషిన్లు కొనుగోలు చేసేవాడు. వాటిని తిరిగి ఓఎల్‌ఎక్స్ లేదా నేరుగా షోరూమ్‌లోనే అమ్మేసేవాడు. వచ్చిన డబ్బులో 10 శాతం ఉంచుకుని మిగిలిన మొత్తాన్ని ఇస్తానని మాట ఇచ్చేవాడు. ఇలా చాలా మంది నుంచి తీసుకుని డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడు. దీంతో రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ, మహారాష్ట్ర, ఢిల్లీ నుంచి బాధితులు విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మధు ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా రుషికొండ జంక్షన్ వద్ద పట్టుకున్నారు. అతడు ఫిర్యాదు చేసిన బాధితుల నుంచి రూ.2,85,659 కాజేయడమే కాకుండా ఏడాదిలో 50 మందిని మోసం చేసినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాలలో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు.విశాఖపట్నం-షాలిమర్ (08508) వీక్లీ స్పెషల్ ప్రతి మంగళవారం ఉదయం 11:20 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 3 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది.ఈ రైలు అక్టోబర్ 21వ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో షాలిమర్-విశాఖపట్నం(08507) ప్రతి బుధవారం ఉదయం 5 గంటలకు షాలిమర్‌లో బయలుదేరి, అదే రోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది. అక్టోబర్ 22 వరకు నడుస్తుంది.చర్లపల్లి-బ్రహ్మపూర్ (07027) వీక్లీ స్పెషల్ రైలు ప్రతి శుక్రవారం రాత్రి 8:25 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.27 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. ఈరైలు నవంబర్ 28వరకు నడుస్తుంది. బ్రహ్మపూర్-చర్లపల్లి (07028) వీక్లీ స్పెషల్ రైలు తిరుగుప్రయాణంలో ప్రతి శనివారం సాయంత్రం 4:45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి, అదే రోజు రాత్రి 9.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.35 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైలు నవంబర్ 29వరకు నడవనుంది. చర్లపల్లి-షాలిమర్ (07225) వీక్లీ స్పెషల్ ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 2.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.05 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది. ఈ రైలు అక్టోబర్ 13 వరకు నడనుంది.షాలిమర్-చర్లపల్లి (07226) వీక్లీ స్పెషల్ ప్రతి మంగళవారం ఉదయం 10 గంటలకు షాలిమర్‌లో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 1.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.30 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైలు అక్టోబర్ 14 వరకు నడుస్తుంది. న్యూటిన్ సుకియా-ఎస్ఎంవీటీ బెంగళూరు (05952) వీక్లీ స్పెషల్..ప్రతి గురువారం సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి, మూడో రోజు మధ్యాహ్నం 3.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.25 గంటలకు బయలుదేరి ఆదివారాల్లో ఉదయం 9.30 గంటలకు ఎస్ఎంవీటీ బెంగళూరు చేరుకుంటుంది. ఈరైలు అక్టోబర్ 30 వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీటీ బెంగళూరు-న్యూటిన్ సుకియా (05951) వీక్లీ స్పెషల్ ప్రతి ఆదివారం రాత్రి 11.50 గంటలకు ఎస్ఎంవీటీ బెంగళూరులో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 9:15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.20 గంటలకు బయలుదేరి బుధవారాల్లో సాయంత్రం 4.25 గంటలకు న్యూటిన్ సుకియా చేరుకుంటుంది. ఈ రైలు నవంబర్ 2 వరకు నడుస్తుంది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు పలు రైళ్లకు అదనపుకోచ్‌లను జతచేశారు. పండుగల వేళ మరికొంత కాలం ఈ అదనపుకోచ్‌ల సౌకర్యాన్ని పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ(18526/18525) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 30వ తేదీ వరకు 2-జనరల్ కోచ్‌లు జత చేస్తున్నారు. విశాఖ-భువనేశ్వర్-విశాఖ (22820/22819) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 30వ తేదీ వరకు 2-జనరల్ సెకండ్ సిట్టింగ్‌కోచ్‌లు, విశాఖ-కోరాపుట్-విశాఖ(18512/ 18511)ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 30వ తేదీ వరకు 2-జనరల్ సెకండ్ సీటింగ్ కోచ్‌లు, విశాఖ-రాయ్‌పూర్-విశాఖ (58528/ 58527) పాసింజర్‌కు ఈ నెల 30వ తేదీ వరకు 1-జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను, విశాఖ-కోరాపుట్-విశాఖ(58538/58537)పాసిజంర్‌కు ఈ నెల 30వ తేదీ వరకు 1-జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నారు. విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ (58532/ 58531) పాసింజర్‌కు ఈనెల 30వ తేదీ వరకు 1-జనరల్ సెకండ్‌క్లాస్ కోచ్‌ను, విశాఖ-భవానిపట్నం-విశాఖ(58504/58503) పాసింజర్‌కు ఈ నెల 30వ తేదీ వరకు 1-జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను, విశాఖ-గుణుపూర్-విశాఖ(58506/ 58505)పాసింజర్‌కు ఈ నెల 30వ తేదీ వరకు 1-జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.

కాపర్ స్టేవ్స్ దొంగతనం కేసులో పురోగతి



స్వాధీనం చేసుకున్న కాపర్ స్టేవ్స్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో జరిగిన స్టేవ్స్ దొంగతనం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించినట్లు తెలిసింది. సుమారు 1200 కిలోల బరువు గల ఆరు కాపర్ స్టేవ్స్ కనిపించకపోవడంపై గత నెల 28న ప్లాంట్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన క్రైం పోలీసులు నలుగురు అనుమానితులను విచారించినట్లు తెలిసింది. వారి నుంచి అందిన సమాచారం మేరకు, పోలీసులు మంగళవారం రెండు స్టేవ్స్‌ను సీఆర్ఎంపీ ఆర్ఈడీ స్టోర్స్ సమీపంలోని పొదల్లో గుర్తించారు. వాటిని అక్కడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నాలుగు స్టేవ్స్‌ను ప్లాంట్ గేటు బయటకు తరలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసు విచారణలో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని, ఒకటి రెండు రోజుల్లో కేసు మొత్తం కొలిక్కి వస్తుందని పోలీసు వర్గాలు తెలిపాయి.

రైలు కింద పడి వ్యక్తి మృతి

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం పారాదీప్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఈ ఘటన జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతడిని ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన దిబాకర్ బాదత్య (30)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిగ్ ఐరన్ తరలింపు కేసులో ఇద్దరికి జైలు శిక్ష

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ నుంచి అక్రమంగా పిగ్ ఐరన్‌ను తరలించడానికి ప్రయత్నించిన ఇద్దరికి గాజువాక కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది.వివరాలు ఇలా ఉన్నాయి. 2019 సెప్టెంబర్ 4న, నలుగున్నర టన్నుల బరువు ఉన్న సిమెంట్ స్లర్రీ మెటీరియల్‌తో స్టీల్ ప్లాంట్‌లోకి ప్రవేశించి, అంతే బరువు కలిగిన పిగ్ ఐరన్‌ను అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తుండగా ఈ ఇద్దరు పట్టుబడ్డారు. మార్కెటింగ్ విభాగం ఏజీఎం రాజీవ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అప్పటి ఎస్‌ఐలు రాధాకృష్ణ, శ్యామలరావులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసుపై మంగళవారం, గాజువాక ఎనిమిదో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. అగనంపూడికి చెందిన నిందితులు లక్కరాజు శివాజీ, పలకా వెంకినాయుడులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా విధించారు.

హోంగార్డు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అల్లిపురం: పోలీసు బ్యాండ్ పార్టీలో హోంగార్డుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మ్యూజిక్‌లో డిగ్రీ, డిప్లమా కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మూడు పోస్టులకు గాను బీ కేటగిరి (టెక్నికల్ అండ్ అదర్ ట్రేడ్స్) ఆడ, మగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు విశాఖపట్నం నగర పరిధిలో నివసించే వారు, 21 నుంచి 50 ఏళ్లు కలిగి.. ఆరోగ్యవంతులైన వారు అర్హులు. డిగ్రీ అర్హత కలిగి, మ్యూజిక్‌లో 55శాతం మార్కులు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు బుధవారం నుంచి సెప్టెంబర్ 30వ తేదీ లోగా సూర్యాబాగ్, పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఇన్‌వార్డ్ సెక్షన్‌లో అందజేయాలని కోరారు.

మరో మూడు రోజుల్లో అందుబాటులో ఎరువులు, యూరియా

మహారాణిపేట: జిల్లాలోని రైతులకు సరిపడా యూరియా, ఎరువులు మరో మూడు రోజుల్లో వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఎరువులు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి. ఆగస్టు నెలకు అవసరమైన 1288 టన్నుల యూరియాలో, ఇప్పటికే 1105 టన్నుల యూరియా జిల్లాకు చేరిందని ఆయన వెల్లడించారు. జిల్లాలో 10,200 హెక్టార్లలో వివిధ పంటలు సాగు అవుతున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు.